క్లుప్తంగా

గనులపై టీబీజీకేఎస్ నిరసన

మందమర్రిరూరల్: కేంద్రం నిర్వహించే బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ మందమర్రి ఏరియాలో సోమవారం టీబీజీకేఎస్ నాయకులు గనులు, డిపార్ట్‌మెంట్లపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు కొండల్ రావు, మాధవరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, ఆయా గనుల ఫిట్ కార్యదర్శులు ఉన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పునఃప్రారంభించాలని వినతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని పునఃప్రారంభించాలని కోరుతూ సోమవారం స్థానికులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఇంతియాజ్, రవి, ముజీబ్, సంపత్ పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లిలో హాజీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్‌సి సేంద్రియ మహిళా రైతులకు దేశీయ కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల గో సేవా ప్రముఖ్, ఆకుతోట రామారావు, హాజీపూర్ డైరెక్టర్లు పూస్కూరి శ్రీనివాస్‌రావు, బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, రాములు, తిరుపతి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

భీమారం: ఓ యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ని సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై బీ.రాములు తెలిపారు. భీమారం మండలం పోలంపల్లికి చెందిన బొల్లం రామస్వామి జూన్ 25న సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఆర్ఐ యాప్ ద్వారా ఫోన్ ఆచూకి తెలుసుకున్న పోలీసులు దానిని స్వాధీనం చేసుకొని యువకుడికి అందజేశారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు చోరీకి గురైనా, పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్/పాతమంచిర్యాల: జూలై 07న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీలోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో నిర్వహించే మాదిగల జనజాతర మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మాతంగి ఓదేలు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. చెన్నూర్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణంతో పాటు ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చికినారపు మల్లేశ్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సరిపడా బస్సులు నడిపించాలి

చెన్నూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో నిరుపేద మహిళలకు మేలు జరుగుతుందని ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. స్థానికంగా సోమవారం ఐద్వా సమావేశం ఏర్పాటు చేశారు. పథకంతో లాభాలు ఉన్నప్పటికీ ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులు నడిపించకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం పథకంలో ఉన్న లోపాలు సరిచేస్తే మహిళలకు మేలు చేకూరుతుందన్నారు. నాయకురాళ్లు తుమ్మ రేణుక, నాగజ్యోతి, కరీమా, సంధ్య, ఉమారాణి, సమ్మక్క, రమాదేవి, స్వరూప, యామిని, బానక్క, శంకరమ్మ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



కొత్త చట్టాల రిజిస్టర్ అందజేస్తున్న సీఐ

మంచిర్యాలక్రైం: దేశ వ్యాప్తంగా అమలవుతున్న నూతన చట్టాలపై జిల్లా పోలీస్‌స్టేషన్‌లో సీఐ భన్సీలాల్, ఎస్సైలకు, రైటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్త చట్టాలకు సంబంధించిన రిజిస్టర్‌ను రైటర్లకు సీఐ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రశాంత్, మహేందర్, సుబ్బరావు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో గల పోలీస్‌స్టేషన్లో కొత్త చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, స్థానిక ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా మినీ స్టేడియం



నిర్మాణ దశలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు



అభివృద్ధిపై నిర్లక్ష్యం..!

- లక్సెట్టిపేట మున్సిపాలిటీలో అసంపూర్తిగా నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న పుర ప్రజలు
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట: పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతుండడంతో నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ఆధాయం అధికంగా ఉన్నప్పటికీ, అభివృద్ధి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. పనులు ప్రారంభించి సంవత్సరాలుగా నిలిచిపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పనులు నిరుపయోగంగా ఉన్నాయి.

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్..

గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా గత ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. పట్టణానికి సమీపంలోని ఊత్కూరు, మోదెల, ఇటిక్యాల గ్రామ పంచాయతీలను కలుపుతూ పదిహేను వార్డులుగా విభజించి నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీగా ఏర్పాటై నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కొన్ని ప్రదేశాల్లో డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. వర్షాకాలం సమీపిస్తున్నందునా ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు..

స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారికి సెంట్రల్ లైటింగ్ కేవలం ఒక గోడతోనే పూర్తి చేశారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు దుకాణాల ముందు ఉన్న ఎంక్రాచెస్ తొలగించలేదు. ప్రభుత్వ కళాశాల మైదానంలో మినీస్టేడియం పేరుతో నిర్మాణం చేపట్టి అర్ధంతరంగా వదిలేశారు. ఎల్ ఆకారంలో నిర్మాణం చేయాల్సి ఉండగా ఒక వైపు స్లాబ్ లెవల్ నిర్మాణం చేయగా, మరో వైపు పిల్లర్ల దశలోనే ఉండిపోయాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులు ప్రారంభించి చాలా రోజులైనా నిర్మాణ దశలోనే పనులు నిలిచిపోయాయి. గోదావరి నదీ తీరాన క్రీడా మైదానం పేరుతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టినా పనికిరాకుండా పోయింది. డంపింగ్ యార్డు పనులు నిలిచిపోయాయి. చెత్తకుప్పలు పెరిగిపోతున్నవి. గోదావరి నదికి పుణ్యస్నానాలకు వెళ్లే భక్తులకు దుర్గంధం వస్తోంది. వార్డులలో డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు సరిగ్గా లేవు. 12వ వార్డులో సీసీ రోడ్డు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు విచ్చలవిడిగా పారుతోంది. పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. మోదెల ఆరో వార్డులో క్రీడా ప్రాంగణాన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేసి ఎటువంటి పరికరాలను ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడకుండా నిర్మించి, ప్రజాధనాన్ని నిరుపయోగం చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. పనులు పూర్తి చేయకుండా బిల్లులు ఎలా తీసుకున్నారని పలువురు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని నిలిచిపోయిన పనులను పూర్తిచేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



గోదావరి రోడ్‌లో విచ్చలవిడిగా చెత్త కుప్పలుగా వెలసిన డంపింగ్‌యార్డు



గోదావరి రోడ్‌లో పరికరాలు లేకుండా అసంపూర్తిగా వదిలేసిన క్రీడాప్రాంగణం

త్వరలో పూర్తి చేస్తాం

మున్సిపల్ పరిధిలో కొద్ది సంవత్సరాల నుంచి ఉన్న సమస్యలను త్వరలోనే పూర్తి చేస్తాం. నిర్మాణాలపై కొన్ని అనివార్య కారణాలతో జాప్యం జరిగింది. పలు వార్డులలో డ్రెయినేజీ, మురుగు నీటిపై చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే సమస్యలు పరిష్కరించి, ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తాం.

– కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్

సమాచారం

జిల్లా తపాలా కార్యాలయం మార్పు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో పాత భవనంలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయం జన్మభూమినగర్‌లోని కొత్త కార్యాలయంలోకి మార్చబడిందని జిల్లా హెడ్ పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. కొత్త కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు పోస్టల్ సేవల కోసం వచ్చే వారి కోసం పాత కార్యాలయ ఆవరణలో కొత్త కార్యాలయం చిరునామా(అడ్రస్)ను ఉంచినట్లు తెలిపారు.

రేపు మండల సమావేశాలు

దండేపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 3న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

లక్సెట్టిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సరోజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి: కిష్టంపేట నుంచి కన్నెపల్లికి వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కోటపల్లి, అలగామ, దేవులవాడలతో పాటు నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేశ్

చెన్నూర్: పట్టణానికి చెందిన తాటికొండ సురేశ్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. సురేశ్ బీసీ యువజన సంఘం, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా పని చేశారని తెలిపారు.

‘ఎమ్మెల్యే పై దుష్ప్రచారం చేస్తే ఊరుకునేదిలేదు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, కొందరు ఎమ్మెల్యే స్థానికంగా ఉండడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, సూర్యనారాయణ, సుశీల్‌కుమార్ అన్నారు. చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజవకర్గంలో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా కాని గ్రామాల్లో ఇప్పటి వరకు 160బోర్లు వేసినట్లు తెలిపారు. మందమర్రి, చెన్నూర్ మున్సిపాలిటీలలో మార్నింగ్ వాక్‌లు చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బాపగౌడ్, చింతల శ్రీనివాస్, పెండ్యాల శ్రీకాంత్, చెన్న వెంకటేశ్, కొంపల్లి బానేశ్, రాకేశ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న ప్రజలు, కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సాయికుంట రోడ్డులో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యతో తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇతరత్ర విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 5వ వార్డు, 17వ వార్డు ప్రజలు, కౌన్సి లర్లు సోమవారం విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలలుగా 16, 17, 3, 4, 5, 18వార్డులలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ఒక ఫీడర్ మీద ఉన్న ఏరియాలకు సరఫరా చేసేలా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సాయికుంటలోని మల్లన్న గుడివద్ద 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కోసం తీసుకెళ్లి ఏడాది అవుతుందని, ఇప్పటికీ అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టలేదని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, 17వ వార్డు కౌన్సిలర్ సునిత పూదరి, నాయకులు పూదరి ప్రభాకర్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల డెమోను రద్దు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ లెక్చరర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈ నెల 2వ తేదీ మంగళవారం నిర్వహించే గెస్ట్ లెక్చరర్ల డెమోను రద్దు చేయాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్‌లెక్చరర్లు కోరారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ, ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్‌పై తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం జరుగుతోందని పేర్కొన్నారు. సదరు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకుండా తాజాగా గెస్ట్‌లెక్చరర్లకు డెమోలు నిర్వహించడంవల్ల పాత వారికి నష్టం కలిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. డెమోను ఆపి పాత గెస్ట్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండగొర్ల చంద్రశేఖర్, రామరాజు, పైడాకుల రవి, ఝాన్సీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిరుపయోగంగా సబ్‌సెంటర్

కాసిపేట: మండలంలోని గట్రామ్‌పల్లి సబ్‌సెంటర్ ఆదివాసీలకు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. నిర్మాణం పూర్తయినప్పటికీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో భవనం నిరుపయోగంగా ఉంటుందన్నారు.

పండ్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రీజనల్ మేనేజర్ రితీశ్ కుమార్ గుప్త ఆధ్వర్యంలో రోగులకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు.

‘శుద్ధమైన తాగునీరు అందించాలి’

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రపర్చి ప్రజలకు శుద్ధమైన నీరందించాలని ఎంపీవో అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కేతన్‌పల్లి గ్రామపంచాయతీల్లో మొబైల్ యాప్ ద్వారా కాలనీలను పరిశీలించారు. రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రంగా ఉంచాలని చెత్త సేకరణ చేపట్టాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

భీమారం: మండల కేంద్రంలోని ఆవిడం ఎక్స్‌రోడ్డు వద్ద వ్యాపారుల సహకారంతో సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టవచ్చునని తెలిపారు.

కార్యవర్గం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ మైదానంలో సోమవారం జిల్లా తాత్కాలిక ఆటో యూనియన్ కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కలవేన శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి షఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజయ్య, ఉపాధ్యక్షుడిగా పడాల రాజేష్, బోరే వెంకటేష్ తో పాటు 21మంది సభ్యులతో కమిటీ నిర్మాణం చేశారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

- ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు
- వైద్యులను సన్మానించిన లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకొని సోమవారం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులను లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రరెడ్డి పాల్గొనగా, పలువురు వైద్యులను శాలువాతో సత్కరించి, మెమెంటో అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ నాగవేణి, డాక్టర్ అనిత, డాక్టర్ అలివేణి, డాక్టర్ సాయిలక్ష్మీ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల్‌మోహన్, ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి కారుకూరి చంద్రమౌళి, కోశాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ చంద్రరెడ్డి, ఎంసీహెచ్ వైద్యుడు వేదవ్యాస్, బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ కే.నాగమల్లేశ్వర్‌రావు, డాక్టర్ ప్రియాంక సక్సేనా, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అభిషేక్, రెడ్‌క్రాస్ చందూరి మహేందర్, వి. మధుసూదన్ రెడ్డి, కే. సత్యపాల్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, యెడ్ల కిషన్, కె. సంతోశ్ కుమార్ పాల్గొన్నారు.



చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తూ...



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో...

చెన్నూర్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆవోపా చెన్నూర్ శాఖ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతిక జైస్వాల్, సత్యనారాయణ, సుతకీర్తి, సిబ్బంది, ఆవోపా జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, శ్రీరాములు, పండురంగం, శంకర్, రాజబాపు, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

జన్నారం: డాక్టర్స్ డే పురస్కరించుకొని సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జన్నారం ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉమాశ్రీ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సతీశ్‌కుమార్, లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని, నేషనల్ చార్టెడ్ అకౌంటెంట్స్‌డే, పోస్టల్ వర్కర్స్‌డేను వేర్వేరుగా నిర్వహించారు. ఆయా రంగాల్లో సేవలు అందిస్తున్న ముగ్గురిని ఎంపిక చేసి సత్కారం చేశారు. వైద్యరంగంలో ఉత్తమసేవలు అందిస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ జె.పూజిత, సీఏ కొడిప్యాక సాయి శ్రీనాథ్, పోస్టుమ్యాన్ పి.బాబురావులకు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఉష మెమోరియల్ ఆసుపత్రి నిర్వాహకులు, డాక్టర్ సంతోష్‌సింగ్‌కు స్థానిక సామాజిక సేవ కార్యకర్తలు కె.శ్రీనివాస్, కలాలి శ్రీనివాస్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ, సెక్రెటరీ పైడాకుల రాజన్న, కోశాధికారి ఆదర్శ్ వర్దన్‌రాజు, రీజియన్ చైర్మన్ రాజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నస్పూర్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం నస్పూర్ డిస్పెన్సరీలో నిర్వహించిన కార్యాక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏరియా ఉత్తమ డాక్టర్‌గా ఎన్నికైన వేదవ్యాస్‌ను, ఉద్యోగులను, సిబ్బందిని సన్మానించారు.

నేరాల నియంత్రణకే పోలీసుల ‘పల్లెనిద్ర’



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

నెన్నెల: నేరాల నియంత్రణకే పోలీసులు పల్లెనిద్రలు చేస్తున్నారని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. చిత్తాపూర్‌లో ఆదివారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, డెబిట్ కార్డుల నంబర్లు అపరిచితులకు చెప్పవద్దన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్ల కొరత ఉందని చిత్తాపూర్‌లో పల్లె గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కావాలని ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో వీధి దీపాలు, సైడ్‌డ్రైన్‌లు, క్రీడాప్రాంగణం కబ్జాకు గురవుతుందని చెప్పారు. స్పందించిన సీఐ సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికే పల్లెనిద్ర కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ విజయ్, వ్యాపారస్తులు, ప్రజలు తదిరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ సద్వినియోగం చేసుకోవాలి



కోటపల్లి: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు



భీమారంలో పాల్గొన్న ఎంపీడీవో రాధారాథోడ్

కోటపల్లి: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భూమన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఎంపీడీవో భూమన్న తెలిపారు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో రాధా రాథోడ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిలిచిపోయిన ప్రజావాణిని తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజావాణి ద్వారా తెలియజేయవచ్చునన్నారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నామమాత్రంగా నిర్వహించారు. ప్రజావాణికి ఎలాంటి అర్జీలు రాలేదు. మండల స్థాయి అధికారులు కాకుండా సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, సుజాత, ఎంఐసీ కో ఆర్డినేటర్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా బాపురావు

జైపూర్: మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారిగా బాపురావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ అధికారి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్ రావు, కార్యదర్శులు, అధికారులు ఆయనను సన్మానించారు.